# జననీ జన్మభూమిశ్చ...

## మాధవపెద్ది పుణ్యశీలాప్రసాద్

"ఇండియా ఈజ్ మై కంట్రీ...
ఆల్ ఇండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్...
ఐ లవ్ మై కంట్రీ...

వెనక స్కూల్లోంచి ప్లెడ్జ్ వినబడుతోంది.

మూడేళ్ళ గౌరవ్ చెవులొగ్గి వింటూ, అదే వల్లె వేస్తున్నాడు.

"ఇండ్యా ఈజ్ మై కంట్రీ...
ఆల్ ఇండీన్స్ ఆల్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్...
ఐ లౌ మై కంట్రీ...

కిలకిలా నవ్వింది కోమలి.

ఆ తర్వాతే కన్నీళ్ళొచ్చాయామెకి.

కొడుకుని గట్టిగా ఇంకా గట్టిగా హృదయానికి హత్తుకుంది.

అట్లాగే ఎంతోసేపు వుండిపోయింది.

"అమ్మా..." అర్చిప్పల్లాంటి కళ్ళు పెద్దవి చేసి చూస్తూ "ఎందుకేడుస్తున్నావు..." అన్నాడు గౌరవ్.

"ఏం ఏడవకూడదా?"

"ఇవాళ పండగ్గదా... పండగనాడు ఏడవ గూడ్దు..."

అవును పండగే... ఇవాళ పండగ జనవరి ఇరవైయారు. పండగ! దేశానికంతా పండగే... కానీ... కానీ.. తమకు మాత్రం...?

కన్నీళ్ళు గౌరవ్ తలని తడుపుతున్నా... కొడుకు కోసం నవ్వింది కోమలి!

* * *

"అమ్మా... నాన్నగారెందుకు పోయారు?" తలదువ్వుతున్న తల్లిని అడిగాడు గౌరవ్ ఇప్పుడు వాడికి ఏడేళ్ళు.

"జబ్బు చేసింది బాబూ"

"వైద్యం చేయించలేమా?"

"చేయించాము..."

"మరి...?"

"ఆ జబ్బు మందులకి లొంగలేదు. ఇంకా పెద్దవైద్యం అమెరికాలో వుందన్నారు. అక్కడికి వెళ్ళాలంటే చాలా డబ్బు కావాలి. అయినా వెళ్దామనే తయారవుతుండేంతలోనే..."

కన్నీళ్ళు ఆగలేదు కోమలికి. గొంతు పెగల్లేదు.

"అమ్మా... నువ్వేడవద్దు..." కన్నీళ్ళు తుడిచాడు గౌరవ్. కొంతసేపయ్యాక "అమ్మా... మనదేశం చిన్నదా-పెద్దదా?" అడిగాడు.

"పెద్దదే బాబూ"

మరి పెద్ద వైద్యం అమెరికాలోనే ఎందుకుంది? మనదేశంలో లేదెందుకని?"

కాసేపాలోచించింది కోమలి.

"ఆ దేశం వాటిల్లో అభివృద్ధిని సాధించింది బాబూ"

"మనదేశం ఎందుకు సాధించలేదు?"

"సాధిస్తుంది బాబూ... నీలాంటి వాళ్ళుంటే తప్పక సాధిస్తుంది నేటిబాలలే రేపటి పౌరులు"

**అమ్మా .... నువ్వు రాత్రింబవళ్ళు పనిచేసి అలసి పోతున్నావ్. అందుకే నీ ఆరోగ్యం పాడవుతోంది. నువ్వు సరిగ్గా భోజనంకూడా చెయ్యడంలేదెందుకమ్మా? నిన్నెంత బాధ పెడుతున్నానో నేను! చదువు మానేసి....**

"అమ్మా... నేను బాగా చదువుకుని డాక్టర్నవుతానమ్మా ... డాక్టర్నయ్యాక... పెద్ద పెద్ద వైద్యాలన్నీ మనదేశంలోనే జరిగేటట్లు చూస్తాను నాన్నలాగా ఎవ్వరూ పోకుండా చూస్తాను"

"నాతండ్రే... నా గౌరవ్ .. నువ్వేరా భరతమాతకి ముద్దుబిడ్డవి..."

ముద్దులతో ముంచేసింది కొడుకుని కోమలి.

* * *

"నాన్నా గౌరవ్ ఇంక పడుకోరా పన్నెండయింది..." తల్లి అంది.

ఏడవతరగతి పబ్లిక్ పరీక్షకి చదువుతున్నాడు కొడుకు.

"పడుకుంటున్నానమ్మా ... ఇదిగో అయిపోయింది..." అంటూ లేచాడు.

'అమ్మా. నన్ను నాలుగింటికి లేపాలి' పడుకోబోతూ అన్నాడు. అన్నాడే గాని తల్లి లేపకుండానే లేచాడు. మళ్ళీ పుస్తకాలు ముందేసుకున్నాడు.

అప్పటికే తల్లి లేచి వాకిట్లో ముగ్గు వేస్తోంది.

"అమ్మా... అడగడం మర్చిపోయాను, పరీక్ష ఫీజు ఎట్లా కట్టావమ్మా... ఈ నెల జీతం రాలేదన్నావుగా...?"

కోమలి ప్రైమరీ స్కూల్లో టీచరుగా పని చేస్తోంది.

"తరువాత చెప్తాలే... ఇప్పుడెందుకు?"

"చెప్పాల్సిందే"

"నా మంగళసూత్రాలు అమ్మేశాను"

"అమ్మా"

"అవున్రా... మీనాన్న లేనప్పుడు నాకెందుకురా. పెట్లో వూరికే వున్నాయి. అమ్మేశాను"

"అమ్మా..." అర్థంకాని ఆవేదనతో తల్లిని కౌగిలించుకున్నాడు గౌరవ్.

కొడుకు తల నిమురుతూ వుండిపోయిందా తల్లి!

* * *

"అమ్మా... నన్నాశీర్వదించు... ఇదంతా నీ

గౌరవ్ తల్లికాళ్ళకి నమస్కారం చేశాడు. ఇంటర్మీడియేట్ ఫస్టు క్లాస్‌లో పాసయ్యాడు. గౌరవ్

"అమ్మా..." ఆగిపోయాడు గౌరవ్.

"ఏంరా అమ్మదగ్గిర సందేహమెందుకు. అడుగు"

"నేను మెడికల్ కోచింగ్ క్లాసెస్‌కి అటెండ్ అవ్వాలనుకుంటున్నాను.. గుంటూర్లో రవి కాలేజ్‌లో"

"అట్లాగే"

"కానీ అమ్మా దానికి డబ్బు చాలా అవుతుందేమోనమ్మా"

"చూద్దాం గౌరవ్..., భగవంతుడేదో మార్గం చూపించకపోడు."

"అమ్మా"

"నువ్వు బాధపడకురా. నేను కొన్ని ట్యూషన్లు చెప్పాలనుకుంటున్నాను. టైలరింగ్ వల్ల కొంత ఎట్లాగూ వస్తోంది. రెడీమేడ్ షాపులకి కొన్ని గౌన్లూ అవ్వీ కుట్టి ఇస్తానన్నాను. కొత్తరకాల స్వెట్లు చెయ్యడం ఈమధ్యనే నేర్చుకున్నాను. అదీ మరింత వుపయోగపడుతుందనుకుంటున్న"

"అమ్మా బాధగా పిల్చాడు.

"నువ్వు మెడిసిన్ చదవాలిరా. అందుకోసం నేనేమైనా చేస్తాను. నువ్వీ సంగతులేవీ పట్టించుకోవద్దు కష్టపడి చదువు అంతే".

ఏం మాట్లాడలేకపోయాడు గౌరవ్

కన్నీరు తుడిచింది తల్లి

* * *

"అమ్మా...నాకు స్కాలర్‌షిప్ వచ్చింది" గౌరవ్ సంతోషంగా వచ్చాడు.

తల్లి పడుకోని వుంది

"అమ్మా..." అంతలోనే కన్నీళ్ళు.

"అమ్మా నువ్వు రాత్రింబవళ్ళు పనిచేసి... అలసి పోతున్నావు అందుకే నీ ఆరోగ్యం పాడవుతోంది నువ్వు సరిగ్గా భోజనం కూడా చేయడం లేదు కదమ్మా-నిన్నెంత బాధపెడుతున్నానో నేను కదమ్మా? అమ్మా! నాకీమధ్య ఎప్పుడూ అనిపిస్తోంది. పోనీ...ఈ చదువు మానేసి ఏదన్నా ఉద్యోగం చేసుకుంటే...?"

"గౌరవ్... గట్టిగా అంది కానీ గొంతు సీరియస్‌గానే పలికింది "ఆమాట మళ్ళీ అనద్దురా" అంది.

"ఈ మాత్రం జ్వరానికే డీలా పడిపోతావేం. ఇంకో మూడేళ్ళు కళ్ళు మూసుకుంటే నువ్వు డాక్టరువవుతావు ఇంక నాకంతా విశ్రాంతే" అంటూ నవ్వింది.

స్కాలర్‌షిప్ కూడా వచ్చిందిగా!... ఇంక కొంతవరకూ నయమే మనకు"



కొడుకుని ఓదార్చింది. గౌరవ్ మాట్లాడలేదు
"అదుగో ఆ డబ్బాలో పంచదార కొంచెం నువ్వు నోట్లో వేసుకుని... నా నోట్లో కూడా కొంచెం వెయ్యి" మళ్ళీ నవ్వింది ఆప్యాయంగా!


* * *

ఫైనలియర్ అయిపోవచ్చింది గౌరవ్‌కి.
కోమలి శరీరం బాగా బలహీనమయింది. తల తెల్లబడిపోయి చాలా పెద్దదానిలాగా వుంది.
"రా... అల్పనా బయటే నిలబడిపోయావేం అమ్మని పరిచయం చేస్తాను లోపలికి"
మెల్లగా అడుగులేస్తూ వచ్చిందో అమ్మాయి.
"అమ్మా... ఈ అమ్మాయి అల్పన-నేను చెప్పుంటానే క్లాసులో మా ఇద్దరికీ కాంపిటేషను ఎక్కువ...."
"రామ్మా-రా-కూచో..." అంది కోమలి ప్రేమగా. అల్పనది కళ్ళు చెదిరే అందం!
కళ్ళు తిప్పుకోలేని అందం!
ఆడవారికే మోహం కలిగిస్తుంటే-ఇంక గౌరవ్ లాంటి యువకుల గురించి ఆలోచించక్కర్లేదు!
"అమ్మా నువ్వేమన కోనంటే ఒక్క విషయం చెప్తానమ్మా..." ఆ అమ్మాయి వెళ్ళాక-తల్లి ఒడిలో చేతులు వేసూ అడిగాడు కొడుకు.
మాట్లాడకుండానే సాలోచనగా కొడుకువైపు చూసింది కోమలి.
"అల్పనని నేను పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నానమ్మా-"
ఏమి మాట్లాడలేదామె
"ఆ అమ్మాయి ఎంతో మంచిది మంచి ఆదర్శాలున్నాయి. మేమిద్దరం కలిస్తే..."
"ఆ అమ్మాయి భాగ్యవంతుల పిల్లకదూ గౌరవ్?-"
"అవునమ్మా-అయితే ఏం? చాలా సామాన్యంగా వుంటుంది. నా ఆశయాలూ-ఆదర్శాలూ నెరవేరాలంటే డబ్బవసరం ఎంతో వుందమ్మా..."
"గౌరవ్... డబ్బవసరం ఎంతవున్నా... అది... అది... మనసొమ్ము... కాదురా..." బాధగా అంది కోమలి
"మేమిద్దరం ఒకటయితే-ఇంక తన-పర-తేడా ఏముందమ్మా?-"
"గౌరవ్... నువ్వు-నువ్వు-మారిపోతున్నావా?..." తనలో తను గొణుక్కుంది కోమలి
"ఊఁ-అవునమ్మా... ఇద్దరమూ డాక్టర్లం... ఇద్దరం కలిసి ప్రాక్టీసు పెట్టి-స్వంత నర్సింగ్ హోమ్ స్థాపించేసి-బీదలకి దరిదాపు వుచితంగా వైద్యం చేస్తాం-ఇంకా. ఇంకా స్పెషలైజ్ చేసి-ఇద్దరం రెండు లైన్లలో రిసర్చిచేసి...అసలా భయంకరమైన జబ్బులనేవి రాకుండా-మందులు కనిపెట్టి-వాటిని అరికడతాం... మా ఆశయాలు తీర్చిదిద్దుకోడానికి డబ్బు ఒక అవరోధం కాకూడదమ్మా...నువ్వింత కష్టపడి ఇంతవరకూ తీసుకొచ్చావు ఇంకా పైకి వెళ్ళడానికి ఆ భగవంతుడే నాకు మార్గం చూపుతుంటే...నువ్వు కాదనకమ్మా...! ఇదీ ఒక అవకాశమే-ఇదీ ఒక అదృష్టమే...అదృష్టదేవత తలుపు తట్టినప్పుడే-తలుపు తెరిచి లోపలికి ఆహ్వానించాలి-కాలదన్నుకుంటే మళ్ళీ రాకపోవచ్చు. కాని... ఒక్కటి మాత్రం నిజమమ్మా...నువ్వు వద్దంటే నేను ఏదీ చెయ్యను-చెయ్యలేను. ఆ తరువాత నీ ఇష్టం..!"
ఏమీ మాట్లాడలేదు కోమలి. ఆమె ద్వైదీభావంతో వుంది.

* * *

లక్షల కట్నమిస్తామంటూ వచ్చాడు-అల్పన తండ్రి- మృదువుగానే వద్దంది కోమలి
"చూడమ్మా-కట్నమేమీ వద్దన్నారు-కనీసం కానుకలన్నా..."
"అన్నగారూ...మీకు తెలీనిదేముంది? పెను

జీన్స్ ప్యాంటు






## టీచర్

"వినేవాళ్ళకు ఏ మాత్రం ఉత్సాహం, అభిరుచి లేకపోయినా వదలకుండా వినిపించే వాళ్ళనేమంటారు." అడిగాడు రవిని మాస్టారు.
"టీచర్..." అన్నాడు వెనక బెంచీ విద్యార్థి.

-బి. వి. ఎస్. బాబు (తెనాలి)

పూర్వకంగా కని పెంచిన కొడుక్కి మీరు వెల గడతానంటే నాకు బాధగా వుంటుంది-"
మరేం మాట్లాడలేదాయన.
కానీ-లోలోపల ఆశ్చర్యమేకాదు, ఆనందం కూడా కలిగిందాయనకి. అందమూ-చదువూ-సంస్కారం వున్న అల్లుడు అసలు ఇవ్వబోతుంటూ లేకుండా లభించడమంటే సామాన్యమా మరి! అల్పనకదొక గర్వకారణం!
పెళ్ళి చదువయ్యాక చేద్దామంది కోమలి
దానికి అల్పన-గౌరవ్ ఇద్దరూ వ్యతిరేకించారు ముందు పెళ్ళయితే-తను చదువు హౌస్‌సర్జన్సీ-పూర్తయ్యేలోపల-తమ ప్రాక్టీసు-నర్సింగ్ హోముల గురించి-చర్చించుకుని-ఒక నిర్ణయానికి వచ్చి-అన్నీ ఏర్పాట్లూ చేసుకోవచ్చని-చదువు పూర్తవగానే-ప్రాక్టీసు మొదలు పెట్టవచ్చనీ-అన్నారు
ఏమనలేకపోయింది కోమలి
పెళ్ళి జరిగిపోయింది.
గౌరవ్‌కి ఎంతో సామాన్యంగా కనబడిన అల్పన పెళ్ళయ్యాక-అత్తవారింటికి వచ్చి-ఒకే ఒక రోజు వుండి వెళ్ళిపోయింది-మరి వుండలేక!
పైకి ఒక సామాన్యమైన కారణం చెప్పారామె తల్లిదండ్రులు-చదువయిపోయాక పిల్ల కాపురానికి వస్తుందని!
దేనికి ఏమీ అనలేదు కోమలి.
ఇప్పుడు కొడుకు ఎక్కువకాలం అత్తగారింట్లోనే గడుపుతుంటే గూడా-ఏమనలేదు!

* * *

పూర్తిగా దస్సిపోయింది కోమలి శరీరం. ఆరోగ్యమూ అంతంత మాత్రంగానే వుంది!
కొడుకు ఇంట్లో లేని రోజున-అన్నం వండుకోడానికి కూడా ఓపికలేక-మంచినీళ్ళు తాగి వుండిపోతోంది

ఆ రోజున-తెల్లవారగానే ఇంటిముందు కారాగింది కొడుకు-కోడలు కలకలలాడుతూ కారు దిగారు ఎన్నాళ్ళ తర్వాతో అత్తగారి టికెట్ ఇచ్చింది అల్పన

"ఆంటీ-" అంటూ కోమలిని కౌగలించుకుంది ఆరోజు వంట పూర్తిగా తనే చేసింది-అల్పన. అత్తగార్ని వంటింట్లోకి రానీయలేదు

కోమలిని కొడుకుతో కబుర్లు చెప్తూ కూర్చోమంది!

కోమలి సంతోషానికి మేరలేదు! కొడుకూ కోడలూ తన కళ్ళెదురుగా తిరుగుతుంటే-తన అదృష్టానికి పొంగిపోయింది!

ఆరోజు కొడుకునీ- కోడల్నీ గుడికి తీసికెళ్ళి పూజ చేయించుకొచ్చింది పొద్దున.

సాయంత్రం కొడుకూ-కోడలూ ఆమెని సినిమాకి తీసికెళ్ళారు

ఆనందంతో అన్నం సహించలేదు కోమలికి.

పన్లన్నీ అయ్యాయి—

పక్క వేసింది అల్పన-వెన్నెట్లో కూచున్నారు ముగ్గురూ! అప్పుడు-చెప్పారు వాళ్ళు-నెమ్మది నెమ్మదిగా అసలు విషయం!

విని నీరుగారిపోయింది కోమలి

వాళ్ళకి అమెరికాలో స్కాలర్‌షిప్ వచ్చిందట!

వీసా రాంగానే వెళ్తారట!

ఇద్దరికీ రావడం లక్కీ అన్నారు!

అందునా ఒకేచోట రావటం ఇంకా అదృష్టమన్నారు! అది పూర్తికాగానే వచ్చేస్తామన్నారు!

అక్కడే వుండే వూహే లేదన్నారు!

అక్కడ విజ్ఞానమేమిటో చూసి-ఇక్కడా అదే అభివృద్ధికి తీసుకువస్తామన్నారు!

ఇవి పదులోపల తిరిగివచ్చేస్తామన్నారు!

వాళ్ళ నాన్నగారు అన్ని ఏర్పాట్లూ చేస్తానన్నారు!

నువ్వేమీ బాధపడాల్సింది లేదన్నారు! ఇప్పుడెతోమంది వెళ్తూనే వున్నారన్నారు! ఇప్పుడమెరికా వెళ్ళటం మన పక్క వూరెళ్ళడం లాంటిదేనన్నారు!

రెండే రెండేళ్ళన్నారు! రెండేళ్ళలోనే వచ్చేస్తామన్నారు!

ఇంకా-అదన్నారు-ఇదన్నారు!

తనని కాదనవద్దన్నారు!

ఏదన్నా-ఏమన్నా-కోమలికి ఒక్కటే తెలుసు!

అదే-అది...అదే. తన కొడుకు తనకి దూరమవుతున్నాడని!

జననికి దూరమవుతున్నాడని!

జన్మభూమికి దూరమవుతున్నాడని !!

* * *

"అల్పనా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్"

తెల్లవారితే, ప్రారంభోత్సవం!

అల్పనకీ-గౌరవ్‌కీ వూపిరి తిరగనంత పని!

అలంకరణలూ- ఏర్పాట్లతో తబ్బిబ్బవుతున్నారు-అమెరికాలో

రెండు చేతులా పుష్కలంగా డబ్బు సంపాదించారు-ఇద్దరూ!

ఏళ్ళు ఎట్లా దొర్లిపోతున్నాయో గమనమే లేదు-ఇద్దరికీ!

పిల్లలిద్దరూ అమెరికాలోనే పుట్టారు!


అల్పన తల్లీ తండ్రీ-వచ్చిపోతూనే వున్నారు వీళ్ళకి మాత్రం ఇండియా వెళ్ళే ప్రసక్తే లేదు! డర్టీ ఇండియాలో ఏముందంటుంది-అల్పన!

కరువు-దరిద్రం-ఏడుపూ-అంతేట! ఇక్కడో?

డబ్బు - భోగాలు - టీవీలూ- కార్పెట్లూ- ఫ్రిజ్‌లూ-వీడియోలు-వాషింగ్ మెషీన్లు-లేనిదేమిటి?

పదేళ్ళ అమిత్-ఆరేళ్ళ అనిత తండ్రి దగ్గరికొచ్చారు

గౌరవ్-ఇన్విటేషన్లు అందరికీ అందాయో లేదోనని మరోసారి లిస్ట్ చెక్ చేసుకుంటున్నాడు.




"నాన్నా-ఈ గొంతు నీదేనా-"

ఒక టేప్ ప్లే చేశారు

"ఏమిట్రా మీ గోల..." విసుగ్గా అనబోయి ఆగిపోయాడు

"ఇండియా ఈజ్ మై కంట్రీ-
ఆలిండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్
ఐ లవ్ మై కంట్రీ ..."

వింటూనే నవ్వొచ్చి...ఆ గొంతు...ఆ గొంతు ...అనన్యంది...అమ్మా!

తను చిన్నప్పుడు పక్కింటి వాళ్ళ టేప్ రికార్డ్-అమ్మకి అది వాళ్ళిచ్చారు...కాదు కొనుక్కుంది.

"అమ్మా..."

అప్రయత్నంగా అన్నాడు!

ఫోన్ మోగింది.

ట్రంకాల్ ఇండియానించి.

మామగారు-

"హలో గౌరవ్...మీ అమ్మకి సీరియస్‌గా వుంది...వుండు కంగారుపడకు ... ఇక్కడ డాక్టర్లు ట్రీట్ చేస్తున్నారు...కానీ...డాక్టర్ల అభిప్రాయం...అమెరికా తీసికెళితే...హోప్ వుండొచ్చుట-కానీ... కదిలించడానికి వీల్లేని సిట్యుయేషన్‌లో వుంది-అందుకని...నువ్వు రానక్కర్లేదు... నేనే- ఎట్లాగో- పంపించే ఏర్పాటు చేస్తాను...ఆ ...ఆ...అ...నీకు కేబుల్ ఇస్తాను...తొందర్లోనే ఏర్పాట్లు చేస్తాను...నువ్వేం కంగారు పడకు.. వుంటుందిలే అనుకో...అమ్మ కదా... నేను చూస్తానుగా... మెసేజ్ ఇస్తాను... అమ్మాయి... పిల్లలూ బావున్నారా..."

....

కాల్ కట్!

"చెప్పునాన్నా...ఈ గొంతు నీదేకదూ..."

మళ్ళీ పిల్లలు!

మళ్ళీ టేప్...

"ఇండియా ఈజ్ మై కంట్రీ...
ఆలిండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్.
ఐ...లవ్...మై...కంట్రీ..."

యామ్ ఐ లవింగ్ మై కంట్రీ..."?

* * *

తెల్లవారింది మరో రోజు-

కేబుల్ వచ్చింది మామగార్నించి-

"మదర్ ఎక్స్‌పైర్డ్..."

"అమ్మా..."

పెద్దగా కేక పెట్టడానికి కూడా గొంతు పెగల్లేదు గౌరవ్‌కి!

*